క్లుప్తంగా

వీధి కుక్కల సమస్యను పరిష్కరించండి



మాట్లాడుతున్న సీపీఎం తెనాలి కార్యదర్శి బాబుప్రసాద్.

తెనాలిఅర్బన్: వీధి కుక్కల సమస్యను పరిష్కరించేలా అధికారులు చర్యలు చేపట్టాలని సీపీఎం తెనాలి కార్యదర్శి కొల్లిపర బాబుప్రసాద్ డిమాండ్ చేశారు. సమర భేరి కార్యక్రమంలో భాగంగా ఆదివారం మారీసుపేటలో సీపీఎం నాయకులు పర్యటించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మురుగు కాల్వల నుంచి దుర్వాసన వస్తోందని ప్రజలు తెలిపినట్లు చెప్పారు. మురుగు పోయే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు షేక్ హుస్సేన్‌వలి, ఎస్.రాజ్యలక్ష్మి, పి.చంద్రకళ, కె.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం

మంగళగిరి: నగరంలోని అమరావతి టౌన్ షిప్ సమీపంలోని పొలాల్లో ఓ గుర్తు తెలియని మహిళ మృతదేహం గుర్తించినట్లు రూరల్ పోలీసులు ఆదివారం తెలిపారు. సుమారు 35 సంవత్సరాలు వయస్సు కలిగిన మహిళ మృతదేహం ఉన్నట్లు గేదెల కాపరులు ఇచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆచూకీ లభించలేదని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దాడి ఘటనపై కేసు

ఫిరంగిపురం: పింఛన్ మంజూరు విషయంలో అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఓ వ్యక్తి సర్పంచ్, ఎంపీటీసీ సభ్యుడిపై దాడి చేసిన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పంచాయతీ కార్యాలయంలో నూతన పింఛన్లు శనివారం పంపిణీ చేశారు. కాగా గ్రామానికి చెందిన సాంబిరెడ్డి తమ అమ్మమ్మ పింఛను కోసం మూడేళ్లుగా తిరుగుతుంటే ఇప్పుడా ఇచ్చేది అంటూ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో సర్దిచెప్పేందుకు ప్రయత్నించిన సర్పంచ్ మేడాబాబు, ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మయ్యలను దూషిస్తూ, దాడికి దిగాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రైలు ఢీకొని వృద్ధురాలు మృతి

మేడికొండూరు: రైలు ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మేడికొండూరు మండల పరిధిలోని పేరేచర్ల రైల్వే స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నరసరావుపేట రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శనివారం ఉదయం పేరేచర్ల రైల్వేస్టేషన్ వద్ద సుమారు 80 సంవత్సరాల వయసుండే గుర్తుతెలియని వృద్ధురాలు రైలు పట్టాలు దాటుతున్న సమయంలో ప్రమాదవశాత్తు రైలుఢీకొని మృతిచెందినట్లు ఎస్ఐ సుబ్బారావు తెలిపారు. మృతురాలి ఆచూకీ తెలిసిన వారు 9948525386 నంబరులో సంప్రదించాలన్నారు.

మాతా, శిశు మరణాల తగ్గింపునకు కృషి



జ్యోతి ప్రజ్వలన చేసి సీఎంఈని ప్రారంభిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: మాతా, శిశు మరణాల తగ్గింపు కోసం నియంత్రణ చర్యలు తీసుకుంటున్నామని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ ఏకుల కిరణ్‌కుమార్ అన్నారు. ఆదివారం ఆస్పత్రిలోని శుశ్రుతా హాలులో గుంటూరు వైద్య కళాశాల అబ్‌స్ట్రిక్స్ అండ్ గైనకాలజీ వైద్య విభాగం ఆధ్వర్యంలో జోనల్ నిరంతర వైద్య విద్య కార్యక్రమం(సీఎంఈ) నిర్వహించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ ఏకుల కిరణ్‌కుమార్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. గర్భిణుల్లో ఎక్కువ మంది రక్తస్రావం జరగటం వల్ల మరణిస్తున్నారని తెలిపారు. ఇలాంటి మరణాలను తగ్గించటానికి పలు వైద్య విభాగాధిపతులతో ఒక టీమ్‌ను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. యూరాలజిస్ట్, జనరల్ సర్జన్, ఎనస్థీషియా, హాస్పిటల్ మేనేజ్‌మెంట్‌తో కూడిన సభ్యులను నియమిస్తామన్నారు. గైనకాలజీ వైద్య విభాగంతో సమన్వయం చేసుకుంటూ మాతా, శిశు మరణాలను నివారించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. గుంటూరు వైద్య కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్, ప్రొఫెసర్లు డాక్టర్ అరుణ, డాక్టర్ జయంతి, రిటైర్డ్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

భార్య, అత్తమామలపై దాడి

గుంటూరు ఈస్ట్: ఓ వ్యక్తి భార్యను, అత్తమామలను కర్రతో కొట్టి దాడి చేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. రామిరెడ్డి నగర్‌లో నివసించే కట్టా సతీష్, దేదీప్యలకు 2019లో వివాహం అయింది. వీరికి పిల్లలు పుట్టలేదు. సతీష్ ఈ కారణంతో భార్యను తరచు వేధించి కొట్టేవాడు. కొద్ది రోజుల క్రితం సతీష్ భార్యను పుట్టింటికి పంపించాడు. శనివారం సతీష్, ఏటి అగ్రహారం 2వ లైనులోని అత్తవారింటికి వెళ్లి గొడవపడ్డాడు. ఈ నేపథ్యంలో సతీష్ కర్ర తీసుకుని భార్య, అత్తమామలను తలపై కొట్టి గాయపరిచాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ హయాంలోనే లెవల్ క్రాసింగ్ మూత

- 2 జిల్లాలు, 3 నియోజకవర్గాల్లోని 7 గ్రామాల రైతుల అవస్థ
- అధికారులు సిఫారసు చేసినా పట్టించుకోని రైల్వేశాఖ
- దశలవారీ ఆందోళనకు సిద్ధమైన రైతులు



మూసివేసిన లెవల్ క్రాసింగ్ రైల్వేగేటు



రూ.4.75 కోట్లతో నిర్మించిన రహదారి...ఇరువైపులా పంటపొలాలు

తెనాలి: తెనాలి–రేపల్లె రైలుమార్గంలో చినరావూరు–జంపని రైల్వేస్టేషన్ల మధ్య లెవల్ క్రాసింగ్ నెం.257 మూసివేత నాలుగొందల పైగా ఎకరాల ఆయకట్టు రైతాంగానికి తీవ్ర ఆటంకంగా పరిణమించింది. నారును చేరవేయటం దగ్గర్నుంచి పండిన పంట ఇంటికి చేర్చేందుకు ఆ డొంకమార్గంలోని లెవల్ క్రాసింగ్ నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. అరవై ఏళ్లకు పైగా ఉపయోగంలో ఉన్న గేటుకు టీడీపీ హయాంలో గండిపడింది. రైతుల గురించి పట్టించుకోకుండా నాటి ప్రజాప్రతినిధుల సూచనపై అధికారగణం సిఫారసులతో రైల్వేశాఖ, లెవల్ క్రాసింగ్‌ను మూసేసింది. రైతులు అడ్డుకుంటారనే భావనతో అర్ధరాత్రి రాకపోకలకు గండికొట్టింది. అప్పట్నుంచి అన్నదాతలకు ఇక్కట్లు మొదలయ్యాయి.

రైల్వే లైనుకు ఇరువైపులా 400 ఎకరాలకు పైగా మాగాణి ఉంది. తెనాలి రూరల్ మండల గ్రామాలైన జగ్గడిగుంటపాలెం, చినరావూరు, పెదరావూరు, బుర్రిపాలెం, కొల్లిపర మండల గ్రామం చక్రాయపాలెం, వేమూరు మండలంలోని జంపని, యడవూరు రైతులకు చెందిన భూముల్లో ఏటా ఖరీఫ్‌లో వరి, రబీలో అపరాలు, ఇటీవలికాలంలో జొన్న/మొక్కజొన్న సాగు చేస్తున్నారు. 2017లో లెవల్ క్రాసింగ్‌ను అర్ధరాత్రి మూసివేశారు. అప్పట్నుంచీ రైతుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ధాన్యం ఉత్పత్తులను చేరవేసేందుకు మూసిన గేటుకు రెండువైపులా రెండు ట్రాక్టర్లను అందుబాటులో ఉంచి, ఒకవైపు నుంచి సరుకును గేటు దగ్గరకు చేరవేసుకుని, కూలీల సాయంతో మరోవైపు ట్రాక్టరులోకి లోడింగ్ చేయించాలి. నారు వేసేటప్పుడూ, ఎరువులకు, పంట అయ్యాక వరిగడ్డిని తీసుకెళ్లాలన్నా ఇబ్బందే. లేదంటే చుట్టూతిరిగి 7–8 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయాలి. వీటన్నిటికీ కూలీలు, రవాణాకు అదనపు ఖర్చు. ఫలితంగా ఏటా పంటల సాగుకయే ఖర్చుకు అదనంగా మరో రూ.7–8 వేలు వ్యయం చేయాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండు జిల్లాలు, మూడు నియోజకవర్గాల పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన ఏడెనిమిది గ్రామాల రైతులకు సంబంధించినదీ సమస్య, వీరే కాకుండా కొల్లిపర మండలం చక్రాయపాలెం, చదలవాడ నుంచి జంపని, కొల్లూరు, భట్టిప్రోలుకు, అటునుంచి ఇటు కొల్లిపర మండలానికి రాకపోకలు చేసే భవన నిర్మాణ కార్మికులు, పెయింటర్లు, రాడ్‌బెండింగ్ కార్మికులు, ఇతర చిరువ్యాపారులకు ఈ డొంక మార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటారు. ఇంత ప్రజోపయోగమైన రహదారి అయినందునే, నాబార్డు నిధులు రూ.4.75 కోట్ల వ్యయంతో ఆర్ అండ్ బీ 5 కి.మీ డొంక మార్గంలో ఆగస్టు 2022 నాటికి తారురోడ్డు నిర్మించారు. ఇంత ఖర్చు చేసిన రహదారికి మధ్యలో గల లెవల్ క్రాసింగ్ మూసివేతతో ఎలాంటి ప్రయోజనం లేకుండాపోయింది.

ఈ సమస్యపై రైతాంగం అప్పట్నుంచీ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ నాటి సబ్‌కలెక్టర్ కె.దినేష్‌కుమార్, తహశీల్దార్ కె.రవిబాబును వెంటతీసుకుని అధికారుల వద్దకు వెళ్లారు. రైతులు, రైతుమహిళలు, కౌలురైతులు తమ కష్టాలను కళ్లకు కట్టినట్టు చెప్పారు. అయినా రైల్వేశాఖ నుండి స్పందన లేకపోవటంతో రైతులు ఆందోళనకు దిగారు. ఇటీవల సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, వివిధ శాఖల అధికారులతో సహా క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. రైతుల సమస్యలను రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా ఫలితం లేదు. దీంతో రైతులు దశలవారీ ఆందోళనకు శ్రీకారం చుట్టారు. ఇందుకోసం రైల్వే గేటు సాధన కమిటీ'గా ఏర్పడి తమ డిమాండ్ నెరవేరేవరకు ఆందోళన చేస్తామని స్పష్టంచేశారు. నాటి వేమూరు ఎమ్మెల్యే, మంత్రి నక్కా ఆనందబాబు, గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్‌లు ఎన్నికల్లో ఓట్ల లబ్ధికోసం ఈ గేటును మూసివేయించి, అక్కడకు కిలోమీటరు దూరంలోని గేటును వాడుకలో ఉంచేలా చేశారని రైతులు ఆరోపిస్తున్నారు. తమ సమస్యపై ఎంపీ జయదేవ్‌కు విన్నవించినా పట్టించుకోవటం లేదని చెబుతున్నారు.

సాగుపనులకు అదనంగా ఖర్చు చేస్తున్నాం



రైలుకట్టకు ఇవతల రైతులంతా చిన్న, సన్నకారు రైతులమే. లెవల్ క్రాసింగ్ గేటు మూసివేతతో నానా అవస్థలు పడుతున్నాం. గేటుకు రెండువైపులా మూడు ఎకరాల పొలం ఉంది. ప్రతి పనికీ అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. ఎంజీ జయదేవ్‌కు చెప్పినా పట్టించుకోలేదు.

– బొంతా గోపి, రైతు, యడవూరు

ఎంపీ గారూ.. రైతుల మొర ఆలకించండి



రైల్వేగేటు సమస్యను ఎంపీ గల్లా జయదేవ్‌కు చెప్పాం అయినా పట్టించుకోలేదు. ఎమ్మెల్యేగారు రోడ్డు వేయించారు. గేటు తీయకపోతే రోడ్డు వేసినా ప్రయోజనం లేనట్టుగా అయింది. వందలాది రైతుల మొర ఆలకించి గేటు తీయించండి ఎంపీ గారూ మీకు దండం పెడతాం..

– బొంతా సాంబశివరావు, రైతు, జగ్గడిగుంటపాలెం

రైతుసంఘం అండగా ఉంటుంది...



సబ్‌కలెక్టర్‌తో సహా జిల్లా అధికారులంతా గేటుతో రైతులు పడుతున్న అవస్థలను రైల్వేశాఖ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవటం లేదు. విజ్ఞాపనలతో సాధ్యంకాదని రైతులే సాధన కమిటీగా ఏర్పడ్డారు. ఆందోళనతో రైల్వే గేటు తెరిపించేందుకు నడుంకట్టారు. రైతుసంఘం అండగా ఉంటుంది.

– ములకా శివసాంబిరెడ్డి, ఏపీ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల ఆహ్వానపత్రిక ఆవిష్కరణ



తెనాలి: ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల ఆశీర్వాదంతో పట్టణ మారీసుపేటలోని అప్పలస్వామి ఆలయం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ఈనెల 6వ తేదీన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుక, 7వ తేదీన ఊరేగింపు నిర్వహించనున్నారు. వేడుకల ఆహ్వానపత్రిక, పోస్టర్లను ఆదివారం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆవిష్కరించారు. అదేవిధంగా మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్, తెనాలి డీఎస్పీ జగన్నాథరావు, త్రీటౌన్ సీఐ రమేష్‌బాబుచే తమ కార్యాలయాల్లో పోస్టర్లను ఆవిష్కరింపజేసి, వారిని ఉత్సవాలకు అతిథులుగా ఆహ్వానించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సమితి, ఇందూ జ్ఞానవేదిక, గుంటూరు కమిటీ అధ్యక్షులు రౌతు శ్రీనివాసరావు, సభ్యులు కృష్ణారావు, పరిమళ, కృష్ణారావు, శ్రీనివాస్, రామకృష్ణ, శివలింగం, హరిబాబు, శ్రీదేవి, రేణుక, దుర్గ, దిల్షా, శ్రీలక్ష్మి, మహాలక్ష్మి, విద్య పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరంలో అక్రమ మద్యం అమ్ముతున్న మహిళపై తాడేపల్లి ఎస్ఐ రమేష్ ఆదివారం కేసు నమోదు చేశారు. ఎస్‌బీ వారు ఇచ్చిన సమాచారం మేరకు వడ్డేశ్వరంలో గతంలో బెల్ట్‌షాప్ నిర్వహించే దొంత రమణమ్మను తనిఖీ చేయగా ఆమె వద్ద 13 క్వార్టర్ బాటిళ్లు లభించాయన్నారు. ఆమెపై కేసు నమోదు చేసి ఆమెను కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

తెనాలిలో వైభవంగా గంగానమ్మతల్లి కొలుపులు



15వ వార్డులో జరిగిన కొలుపులలో పాల్గొన్న ఎమ్మెల్యే శివకుమార్, కౌన్సిలర్ కోటేశ్వరరావు



మారీసుపేటలో గంగానమ్మ గుడి వద్ద పూజలు చేస్తున్న భక్తులు

తెనాలిఅర్బన్: గంగానమ్మ తల్లి కొలుపులను తెనాలిలో ఆదివారం పలు చోట్ల వైభవంగా నిర్వహించారు. గంగానమ్మకు పూజలు చేసి పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. కనక తప్పెట్ల మధ్య అమ్మవారి వేషధారణలో పలువురు నాట్యం చేశారు. 15వ వార్డు పాత డిపో రోడ్డులో రజక యువత ఆధ్వర్యంలో నిర్వహించిన కొలుపులలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గంగానమ్మకు పూజలు చేసి ఊరేగింపులో పాల్గొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు, సుంకర కొండలరావు, మేడేపల్లి ప్రభాకర్, మామిడాల సుమన్, మామిడాల సురేష్, సురుపుల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు. మారీసుపేట రెండు గేట్ల మధ్యలోని గంగానమ్మతల్లి దేవస్థానం ఆధ్వర్యంలో కొలుపులు నిర్వహించారు. గంగానమ్మకు పూజలు చేసి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఊరేగింపులో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మోపిదేవి శ్రీనివాసరావు, పెదలంక వెంకటేశ్వర్లు, చెన్నుపల్లి శ్రీనివాస్, చెన్నుపల్లి రవిబాబు, పులి వెంకటేశ్వర్లు, నిడుబ్రోలు రాంబాబు, రావూరి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీలపై దాడులు హేయం



మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్టీ సంఘం చైర్మన్ పి.శ్రీనివాసరావు

ఫిరంగిపురం: ఎస్టీలపై దాడులు చేయడం హేయమని, వాటిని ఆపకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతామని రాష్ట్ర ఎస్టీ సంఘం చైర్మన్ పి.శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీ కార్యాలయం వద్ద సర్ది చెప్పేందుకు వచ్చిన గ్రామ సర్పంచ్ మేడాబాబు, ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మయ్యలపై దాడిచేయడం దుర్మార్గం అన్నారు. విధులకు ఆటంకం కలిగించి, దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని డిమాండు చేశారు. ఇటువంటి దాడి చేయడం అమానుషం అన్నారు. సమావేశంలో సంఘ నాయకులు శంకరరావు, ఎం.వెంకటేశ్వర్లు, కె.కిషోర్, పి.ఏడుకొండలు, సర్పంచ్ మేడాబాబు, ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మయ్యలు పాల్గొన్నారు.

జాతి నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలకపాత్ర

రోటరీ క్లబ్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానోత్సవంలో వక్తలు



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలతో అతిథులు

తెనాలి: రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో ఆదివారం గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీవివేకానంద సెంట్రల్ స్కూల్ ఆవరణలోని ఆడిటోరియంలో ఏర్పాటైన ప్రత్యేక సభలో 'రోటరీ నేషన్ బిల్డర్ అవార్డ్స్–2023' పేరిట ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులను ప్రదానం చేశారు. ఏపీ మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జాతి నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలకపాత్రగా చెప్పారు. సామాజికసేవలో నిమగ్నమైన రోటరీ క్లబ్ నేషన్ బిల్డర్స్ పేరిట ఉపాధ్యాయులకు అవార్డులను బహూకరించటం అభినందనీయమన్నారు. రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3150 పీడీజీ అన్నే రత్నప్రభాకర్, అసిస్టెంట్ గవర్నర్ కన్నెగంటి మురళీకృష్ణ, వివేక విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ రావిపాటి వీరనారాయణరావు మాట్లాడారు. అనంతరం అతిథులు అవార్డులు ప్రదానం చేశారు . ప్రధానోపాధ్యాయుడు జి.లలితాప్రసాద్ (బుర్రిపాలెం), విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ ఎం.అర్జున (పొన్నూరు), విశ్రాంత ఉపాధ్యాయులు వి.వెంకటప్రతాప్ (దుగ్గిరాల), కె.విజయ్‌కుమార్ (వేజండ్ల), వి.విద్యాసాగర్ (చీరాల), స్కూల్ అసిస్టెంట్లు కె.అమరభాస్కర్ (యడ్లపల్లి), ఎస్.రాజేశ్వరి (పెదరావూరు), ఎం.బాలనాగయ్యనాయక్(కొలకలూరు), ఎ.ఆంజనేయశర్మ (తెనాలి), ఎ.జ్యోతి (తెనాలి), ఎంవీ రఘునాథరావు(తెనాలి), బి.ప్రకాశరావు (అయితానగర్), సయ్యద్ బాషు (చిలుమూరు), ఎ.యాకోబు (వైష్ణవి), కె.బాబు (తెనాలి), ఎ.వాసంతి (తెనాలి), కె.లకుమాదేవి (తెనాలి) అవార్డులను స్వీకరించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు పావులూరి రాంబాబు, కార్యదర్శి నల్లూరి వెంకటేశ్వరరావు, కోశాధికారి కేఎల్ జగదీశ్వరాంబ పర్యవేక్షించారు. రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు ఈదర వెంకటపూర్ణచంద్, గుత్తా వెంకటరత్నం, పాస్ట్ గవర్నర్ గల్లా సాంబశివరావు, చేతన్‌రాజ్ కొఠారి, నరేష్‌కుమార్ జైన్, బత్తుల వెంకటేశ్వరరావు, డి.మురళీకృష్ణ, కుర్రా శ్రీనివాసరావు, డాక్టర్ రవీంద్రనాథ్, అన్నం పిన్నారావు పాల్గొన్నారు.

జన సైనికుల వీరంగం

- తాగి నడిరోడ్డుపై రౌడీయిజం
- రెండు బైక్‌లు ధ్వంసం
- నలుగురు కూలీలపై దాడి
- ద్విచక్రవాహనాలు లాక్కున్న వైనం
- పోలీసులపైనా వీరంగం
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన



ధ్వంసమైన ద్విచక్ర వాహనం

తాడేపల్లిరూరల్: జనసైనికుల రౌడీయిజం ఆలస్యంగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకల సందర్భంగా ఎంటీఎంసీ పరిధిలోని కొలనుకొండ, కత్తులపేటలో జనసేన పార్టీకి చెందిన కార్యకర్తలు ద్విచక్రవాహనాలతో ఫీట్లు కొడుతూ ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేసిన సంఘటనపై పోలీసులు ఆలస్యంగా కేసు నమోదు చేయడంతో వెలుగులోకి వచ్చింది. సేకరించిన వివరాల ప్రకారం ఆత్మకూరుకు చెందిన డి.హోసన్న, కె.తేజ రాడ్ వెల్డింగ్ పనిచేస్తూ జీవనం కొనసాగిస్తుంటారు. పని ముగించుకుని కొలనుకొండ కత్తులపేట నుంచి ఆత్మకూరులోని వారి ఇంటికి వెళుతుండగా బైక్‌లతో వీరంగం చేస్తున్న జనసేన పార్టీ వారిని చూసి రోడ్డుపక్కన తమ ద్విచక్ర వాహనాలను ఆపారు. జనసేన కార్యకర్తలు ఎంతసేపటికీ తమ బైక్‌లను రోడ్డుకు అడ్డంగా పెట్టి తీయకపోవడంతో హోసన్న వారిని రోడ్డుకు అడ్డుగా ఉన్న బండ్లను తీయాలని కోరాడు. అప్పటికే మద్యం మత్తులో వున్న లడ్డా అనే జనసేన పార్టీ కార్యకర్త పరుష పదజాలంతో హోసన్న, తేజల ద్విచక్ర వాహనాల తాళాలు లాక్కున్నాడు. అప్పటికే 20 మంది జనసైనికులు గుమికూడి హోసన్న, తేజాలతోపాటు ఉన్న మరో ఇద్దరిపై దాడిచేశారు. మా బైక్‌లు మాకు ఇస్తే మేం వెళ్లిపోతామని హోసన్న కోరగా, బండ్లు ఇచ్చేదిలేదంటూ ఓ ద్విచక్ర వాహనాన్ని లడ్డా, అతని అనుచరులు పగలకొట్టారు. మరో ద్విచక్రవాహనాన్ని ఇచ్చి ఇక్కడే ఉంటాము. ఎవరిని తెచ్చుకుంటావో తెచ్చుకో అంటూ మరో ద్విచక్రవాహనాన్ని ఇచ్చివేశారు.

పోలీసులపైనా దాడి..

హోసన్న తేజలు రాత్రి 10 గంటల సమయంలో పోలీసులను ఆశ్రయించగా పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లారు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న లడ్డాతోపాటు అతడి అనుచరులు పోలీసులపైనా దాడి చేశారు. పోలీసులు లడ్డాను పోలీస్‌స్టేషన్‌కు రావాలని కోరగా, తనంతట తానే గోడకు తల కొట్టుకుని భయభ్రాంతులకు గురిచేశాడు. పోలీసులు తమదైన శైలిలో లడ్డాను విచారించగా అక్కడ వున్న మిగతా జనసైనికులు పరారయ్యారు. లడ్డాను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి తనంతట తాను కొట్టుకుని గాయం కావడంతో ఆసుపత్రికి పంపించారు. జరిగిన సంఘటనపై హోసన్న, తేజలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శేషగిరిరావు తెలిపారు.

ప్రమాదకరంగా ఫ్యూజ్ బాక్స్



మెయిన్ రోడ్ లో ప్రమాద భరితంగా వేలాడుతున్న విద్యుత్ ఫ్యూజ్ బాక్స్

నెహ్రూ నగర్: స్థానిక నెహ్రూ నగర్ 9వ లైన్ మెయిన్ రోడ్ లో విద్యుత్ ఫ్యూజ్ బాక్స్ రోడ్డు మీదకు వేలాడుతూ ప్రమాద భరితంగా మారింది. అటుగా రాకపోకలు సాగించే వాహనదారులు చూడకుండా ప్రమాదవశాత్తు ఫ్యూజ్ బాక్స్‌ను తగిలితే ఎటువంటి నష్టం జరుగుతుందో అని వాహనదారులు, స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

శ్రీకృష్ణ ఆలయ శంకుస్థాపన మహోత్సవం



శ్రీకృష్ణ ఆలయ శంకుస్థాపన మహోత్సవంలో పాల్గొన్న యాదవ సంఘ నేతలు

మంగళగిరి: నగరంలోని ఇందిరానగర్ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం శ్రీకృష్ణ ఆలయ శంకుస్థాపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాలయం ట్రస్టుబోర్డు మాజీ ధర్మకర్త తాడిబోయిన సురేష్ యాదవ్, శివలీల దంపతులు శంకుస్థాపన పూజలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి, దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి హాజరై మాట్లాడుతూ శ్రీకృష్ణుని ఆలయం నిర్మాణం చేయడం అభినందించాల్సిన విషయమన్నారు. ఆలయ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనడం తమ పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామని, కృష్ణ భగవానుని కరుణా కటాక్షాలతో ప్రజలు సుఖంగా, రైతాంగం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. వివిధ పార్టీలకు చెందిన యాదవ ప్రముఖులు మాట్లాడుతూ ఎన్నో దశాబ్దాల నుంచి యాదవ సోదరులకు కల్యాణ మండపం లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) యాదవుల చిరకాల వాంఛ అయిన కమ్యూనిటీ హాలు, శ్రీకృష్ణ మందిరంలకు ఒకే చోట సుమారు 25 సెంట్ల స్థలాన్ని కేటాయింపు చేయడం అభినందనీయమని, ఆయనకు తమ సంఘం ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘ పెద్దలు చిన్ని తిరుపతయ్య, తుల్లిమిల్లి రామకృష్ణ, దానబోయిన సుందరరావు యాదవ్, దొడ్డక శివపార్వతి, భోగి కోటేశ్వరరావు, ఆర్ల బ్రహ్మయ్య, మర్రి వెంకయ్య, యర్రాకుల తులసీరామ్, చావలి ఉల్లయ్య, డీవీఆర్, చింకా మహేష్, దొడ్డక కృష్ణ, ఆలయ కమిటీకి చెందిన 18 మంది ప్రతినిధులు, యాదవ సంఘం నాయకులు, యాదవ యూత్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పేద కళాకారులను ప్రోత్సహించాలి



యూనిఫాం పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు బెజ్జం సాయిప్రసాద్, నరసింహారావు

తాడికొండ: పేద కళాకారులకు ప్రోత్సాహం అందించి వారికి అండగా నిలవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని వైఎస్సార్ సీపీ తాడికొండ నాయకుడు బెజ్జం సాయిప్రసాద్ అన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని వైఎస్సార్ స్మారకార్థం ఆదివారం తాడికొండలో డప్పు కళాకారులకు ఆయన వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళా రంగంలో డప్పు కళాకారుల పాత్ర ప్రత్యేకమైనదని, అనాది కాలం నుంచి వారి సేవలు పలు రకాల శుభకార్యాలు, ఇతర కార్యక్రమాల ద్వారా సమాజంలో అన్నివర్గాలకు ప్రయోజనకరంగా ఉంటున్నాయన్నారు. ఇటీవల కాలంలో పెరిగిన మ్యూజిక్ ఫ్యాషన్ కారణంగా అనాదిగా వస్తున్న ఈ కళ అంతరించిపోకుండా డప్పు కళాకారులకు చేయూతనందించి వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి తోకల నరసింహారావు, దాత బెజ్జం సాయి ప్రసాద్ చేతులు మీదుగా డప్పు కళాకారులకు రూ.12 వేలు విలువ చేసే వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు ఉండవల్లి నరసింహారావు, రమేష్, షేక్ హుస్సేన్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

పాత గుంటూరు: రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు సెంటీనియల్ ఆధ్వర్యంలో రింగు రోడ్డులోని జె.కె.సి. కళాశాలలో ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి క్లబ్ అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీనివాసరావు అధ్యక్షత వహించి మాట్లాడారు. వైద్యులు డాక్టర్ రాకేష్, డాక్టర్ ప్రియాంక రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. క్లబ్ సభ్యులు షాజహాన్ పేరేచర్లలోని సాయినాథ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. ఏజీ గవర్నర్ సుబ్బారావు, కళాశాల చైర్మన్ జాగర్లమూడి మురళీమోహన్‌పాల్గొన్నారు.

6న విజ్ఞాన మందిరంలో శివ శంఖారావం

పాత గుంటూరు: శ్రీ కృష్ణ జన్మాష్టమి పురస్కరించుకుని ఈ నెల 6వ తేదీన వాసవి ఇంటర్నేషనల్ పరివార్ ఆధ్వర్యంలో శివ శంఖారావం నిర్వహించనున్నట్లు కన్వీనర్ దేవరశెట్టి రామకృష్ణ తెలిపారు. ఆదివారం ఆర్ అగ్రహారంలో విలేకరుల సమావేశంలో నిర్వహించారు. గుంటూరు వెంకటేశ్వర విజ్ఞానమందిరంలో నిర్వహించనున్న కార్యక్రమంలో రుక్మిణీ కల్యాణం, అలంకార ప్రదర్శన, సర్ప సూక్త హోమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.